

# నేటినిజం

తెలుగు దినపత్రిక





website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 18-4-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 214 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## గాలి ద్వారా కరోనా స్వైర విహారం-ప్రజలను హెచ్చరించిన హెల్త్ డైరెక్టర్



హైదరాబాద్, ఏప్రిల్ 16:హైదరాబాద్ : కరోనా సెకండ్ వేవ్ ఉధృతి అంచనా వేసిదానికంటే ఎక్కువుగా ఉందని, గాలి ద్వారా అతి వేగంగా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తున్నదని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు హెచ్చరించారు?.కోఠిలోని ప్రజారోగ్య కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ,కరోనా తొలి దశ నుంచి ప్రజలు పాఠాలు నేర్చుకోలేదని,. కరోనా వెళ్లిపోయిందనే భ్రమలో జనం ఉన్నారన్నారు? మొదటి వేవ్‌ను ఎంతో కొంత అడ్డుకోగలిగామని, ఆ తర్వత ప్రజల్లో అలసత్వం వచ్చిందని వాపోయారు. ప్రస్తుతం గాలి నుంచి వ్యాపించే దశకు కరోనా చేరుకుందని పేర్కొన్నారు. కొత్త మ్యుటేషన్ల కారణంగా కరోనా వేగంగా వ్యాపిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మాస్కు ధరించాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో కొవిడ్ చికిత్సకు పడకలు, మందులు, ఆక్సిజన్ కొరత లేదని, రాష్ట్రంలోని 116 ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొవిడ్ చికిత్స కొనసాగుతుందని స్పష్టం చేశారు. . కరోనా రెండో దశ వ్యాప్తి ఉధృతంగా ఉందని,. ప్రపంచంలోని అగ్ర రాజ్యాలు కూడా కరోనా ముందు మోకరిల్లుతున్నాయని అన్నారు. . రాష్ట్రంలో ఎక్కడా బెడ్ల కొరత లేదని, కేవలం 15-20 కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే పడకల కొరత ఉందని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో 5 కొవిడ్ ప్రత్యేక ఆస్పత్రులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కొవిడ్ టెస్టుల సంఖ్యను పెంచుతామని ప్రకటించారు. 80 శాతం మంది కరోనా బాధితుల్లో ఎలాంటి లక్షణాలు లేవు అని వెల్లడించారు. కరోనా పాజిటివ్ రాగానే ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇది ఇలా ఉంటే రోజుకు లక్షకు పైగా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కేవలం 15 రోజుల్లో పాజిటివ్ రేటు రెట్టింపు అయ్యిందన్నారు. నిన్న ఒక్కరోజే లక్షా 26 వేల కరోనా పరీక్షలు నిర్వహిస్తే.. 4,446 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కొవిడ్ వ్యాప్తి చెందిన తొలినాళ్లలో 18 వేల బెడ్లు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్యను 38 వేలకు పెంచామన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో బెడ్ల సంఖ్యను 53 వేలకు పెంచుతామని తెలిపారు. కొవిడ్ టెస్టుల సంఖ్యను కూడా పెంచుతామన్నారు.

## వ్యవసాయ రంగంలో వినూత్న ఆవిష్కరణలు అవసరం : గవర్నర్

హైదరాబాద్, ఏప్రిల్ 17: వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలు అవసరమని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధనలో వ్యవసాయ రంగం పాత్ర కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు.

శనివారం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం వర్చువల్ విధానంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రమేశ్ చంద్‌తో కలిసి గవర్నర్ తమిళి సై విద్యార్థులకు, పరిశోధకులకు పట్టాలు ప్రదానం చేసి మాట్లాడారు.

వ్యవసాయం, పాడిపశువులతో ఆదాయం పెరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగానికి మరిన్ని ప్రోత్సహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## కోవిడ్‌పై పోరాటానికి కుంభమేళా ఓ ప్రతీకగా నిలవాలి : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరుగుతున్న కుంభమేళా ఇక ముగిసే అవకాశాలు ఉన్నాయి. కుంభమేళాపై ప్రధాని మోదీ ఇవాళ తన ట్విట్టర్‌లో స్పందించారు. కుంభమేళా మహా వేడుకను ఇక ఒక సంకేతంగా మాత్రమే చూడాలన్నారు. కరోనా సంక్షోభ వేళ కుంభమేళాను నిలిపివేయడం ఉత్తమం అన్న అభిప్రాయాన్ని ఆయన వినిపించారు. భక్తుల రద్దీ లేకుండా చూడాలన్నారు. నిరంజనీ అకారా సాధువుల క్షేమ సమాచారం తెలుసుకున్నట్లు మోదీ చెప్పారు. హరిద్వార్‌లో జరుగుతున్న కుంభమేళాలో సాధువులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం రోజున సుమారు 30 మంది సాధువులు కరోనా పరీక్షలో పాజిటివ్‌గా తేలారు.

ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ.. నిరంజనీ అకారా అధ్యక్షుడు స్వామి అవదేశానంద గిరి జీ మహారాజ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సాధువుల ఆరోగ్యం కోసం అన్ని రకాల సహకారాలు అందించనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఇప్పటి వరకు కుంభమేళాలో సాధువులు రెండుసార్లు పుణ్య స్నానాలు చేశారని, ఇక కుంభమేళాలో జరిగే క్రతువులను ఒక ప్రతీకగా మాత్రమే ఉంచుదామని, దీని వల్ల కరోనా సంక్షోభంపై పోరాడేందుకు బలం వస్తుందని ప్రధాని తెలిపారు. నిరంజనీ అకారా కార్యదర్శి మహంత్ రవీంద్ర పురి కోవిడ్ పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. నిరంజనీ అకారా చీఫ్ నరేంద్ర గిరి కూడా కోవిడ్ పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. ఆయన్ను రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో అడ్మిట్ చేశారు.

## పాలమూరు -రంగారెడ్డి ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17:: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నిరందేలా చూస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

శనివారం ఆయన మూసాపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతు వేదికలు, ఇతర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు.

గతంలో విద్యుత్, తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారిని, సర్పంచులు ప్రజలకు జవాబుదారీగా ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు.

ప్రస్తుతం విద్యుత్‌కు ఎలాంటి సమస్య లేదన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. వేసవిలో చెరువులు, కుంటలు నింపి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తానని అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. "ఎన్నో ఇబ్బందులు మూసాపేట మండలం తీసుకువచ్చాం. రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలి.

రైతులు ప్రతి వారం రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించుకోవాలి. నియోజకవర్గంలోని అన్ని వాగులపై చెక్ డ్యాములు నిర్మిస్తున్నాం.

నిజలాపూర్ చెరువు ఆధునీకరణకు చర్యలు తీసుకుంటాం" అని ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, ఎంపీపీ కళావతి, మూసపేట సర్పంచ్ అన్నపూర్ణ, రైతుబంధు మండల కో -ఆర్డినేటర్ రఘుపతి రెడ్డి, వ్య వసాయశాఖ సహాయ సంచాలకులు యశ్వంతరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## కరోనాతో బిజేపీ రాష్ట్ర ట్రెజరర్ భవర్ లాల్ కన్నుమూత

హైదరాబాద్, ఏప్రిల్ 17: బిజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి భవర్ లాల్ వర్మ కరోనాతో కన్నుమూశారు.. గత నెల 28న కరోనా భారీన పడిన ఆయన సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పటల్లో చికిత్స కోసం చేరారు.. కరోనా తో పాటు నిమోనియా వ్యాధి కూడా చేకూరడంతో రోజురోజుకు వారి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆయన శనివారం ఉదయం మృతి చెందినట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు. కాగా, వర్మ సనత్ నగర్ నియోజకవర్గ మొండా డివిజన్ ప్రాంతానికి చెందిన వ్యక్తి . చాలా కాలం పాటు బీజేపీలో పని చేశారు. గతంలో సనత్ నగర్ నియోజకవర్గం ఇంచార్జీగా కొనసాగారు. అలానే 2002 లో మొండా డివిజన్ బీజేపీ కార్పొరేటర్ గా గెలుపొందారు. ది. 2018లో సనత్ నగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వర్మ కి నలుగురు కుమార్తలు, ఒక కుమారుడున్నాడు.. ఇటీవల వర్మ చికిత్స పొందుతున్న సమయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జాతీయ నాయకులు, మురళీధర్ రావు, తదితరులు వర్మ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం ఇచ్చారు. ఆయన మరణం పట్ల పలువురు సంతాపం ప్రకటించారు..

## ఫోన్ ట్యాపింగ్ దోషులను విడిచిపెట్టను : దీదీ

కోల్ కతా, ఏప్రిల్ 17:: తన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారందరి వివరాలను రాబడతానని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కూచ్ బెహార్ కాల్పుల ఘటనపై దీదీ మాట్లాడినట్టు చెబుతున్న ఆడియో క్లిప్ వైరల్ గా మారిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. సితాల్ కుచ్చి టీఎంసీ అభ్యర్థి పార్థ ప్రతిం రాయ్, దీదీ మధ్య ఈ సంభాషణ సాగినట్టు చెబుతున్నారు. కూచ్ బెహార్ కాల్పుల ఘటనలో మరణించిన వారి పార్థివ దేహాలతో నిరసన ర్యాలీ చేపట్టాలని ఈ సంభాష ణలో దీదీ చెబుతున్నట్టు ఆడియో క్లిప్ లో రికార్డైంది. కాగా, ఆడియో క్లిప్ ద్వారా బెంగాల్ లో ఉద్రిక్తతలను పెంచేలా టీఎంసీ కుట్ర పన్నిందని ఆరోపిస్తూ బీజేపీ ప్రతినిధులు బెంగాల్ ఎన్నికల ప్రధానాధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. మరోవైపు కూచ్ బెహార్ కాల్పుల ఘటనను టీఎంసీ రాజకీయం చేస్తోందని అసన్సోల్ లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు.

## స్వీయ నియంత్రణ, మాస్కు ధరించడమే శ్రీరామ రక్ష : మంత్రి వేముల



నిజామాబాద్, ఏప్రిల్ 17:: స్వీయ నియంత్రణ పాటిస్తూ, మాస్కులు ధరించడమే శ్రీరామ రక్ష.. చేతులు ఎప్పుడూ శుభ్రం చేసుకుంటూ.. ఇంట్లో కూడా మాస్క్ ధరించాలి అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. కోవిడ్ నియంత్రణ, వ్యాక్సినేషన్ పై నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో వేర్వేరుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో రాష్ట్ర రోడ్లు-భవనాలు,గృహ నిర్మాణ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. కామారెడ్డిలో నిర్వహించిన సమావేశానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యే హనుమంత్ షిండే, ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. కోవిడ్ రెండవ దశలో వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించాం.

జిల్లాలో అధిక సంఖ్యలో కొవిడ్ పరీక్షలు చేయడం, పాజిటివ్ వచ్చిన వారికి వైద్యం అందించడం, కరోనా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయడం వంటి అంశాలపై చర్చించామని తెలిపారు. జిల్లాలో 29 పరీక్షా కేంద్రాలలో ప్రతి రోజు 3,000 వరకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వీయ నియంత్రణ, మాస్కు ధరించడమే శ్రీరామ రక్ష : మంత్రి వేముల

### అందుబాటులో 140 ఆక్సిజన్ పడకలు

కరోనా రెండవ దశలో జిల్లాలో ఒక లక్షా 50 వేల మందికి పరీక్షలు చేయగా 4,000 కేసులు యాక్టివ్‌లో ఉన్నాయి. అందులో 50 మంది ప్రభుత్వ ఏరియా, జిల్లా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.

మిగతావారు వైద్యుల సూచనల మేరకు హోమ్ ఇసొలేషన్ లు ఉన్నారు. జిల్లాలో ఇప్పటికే 40 ఆక్సిజన్ బెడ్లు ఉన్నాయి. మరో 90 బెడ్ల ఏర్పాటుకు.. బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో 50, దోమకొండ పిహెచ్‌సీలో 10, మద్నూర్ 10, ఎల్లారెడ్డి లో 10 ఆక్సిజన్ బెడ్లు పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. మొత్తం 140 ఆక్సిజన్ బెడ్లు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు.

### రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ముందంజ

జిల్లాలో 30 వాక్సినేషన్ కేంద్రాల ద్వారా 2.30 లక్షల మందికి వ్యాక్సినేషన్ వేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఒక లక్ష మందికి(44 శాతం మందికి) టీకా వేసి కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. జిల్లాలో రోజుకూ 4 వేల నుండి 5 వేల మందికి టీకా వేస్తున్నామని మంత్రి వేముల తెలిపారు.

వ్యాక్సినేషన్ కోసం సిబ్బంది కొరత ఉన్నందున.. కొంత మంది వైద్య సిబ్బంది కరోనా బారిన పడిన నేపథ్యంలో తాత్కాలిక పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, మెడికల్ ఆఫీసర్లను అవసరమైన మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించుకోవాలని అదేశించామని చెప్పారు.

స్వీయ నియంత్రణ, మాస్కు ధరించడమే శ్రీరామ రక్ష : మంత్రి వేముల

### బోర్డర్‌లో రాకపోకలపై నిఘా

అలాగే రెవెన్యూ, పోలీసు విభాగాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఏర్పాటు చేసి మహారాష్ట్ర బోర్డర్‌లో రాకపోకలపై నిఘా ఏర్పాటు చేశామని మంత్రి స్పష్టం చేశారు.

తప్పనిసరి అయితేనే ప్రజలు బయటకురండి. మార్కెట్, కిరాణా, జనరల్ షాపులు, విక్రయాల షాపుల్లో తప్పనిసరిగా మస్కులు వాడాలి.

శానిటైజర్లు వినియోగించాలి. ప్రభుత్వ కోవిడ్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదేశించాం. మాస్కు లేకుంటే ఫైన్ వేస్తారు.

మాస్కులు ధరించడమే శ్రీరామ రక్ష. చేతులు ఎప్పుడూ శుభ్రం చేసుకు ంటూ.. ఇంట్లో కూడా మాస్క్ ధరిం చాలి. చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి అని మంత్రి వేముల సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంతు షిండే, జడ్పీ చైర్ పర్సన్ శోభా, మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, జిల్లా కలెక్టర్ శరత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే పలువురు రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ ఓహోయను బ్యాటింగును-
ఆహా యని పించునట్టి - యాటను జూపన్
కావాలి ప్రయోగించు కరణి
"రాహుల"న కాసంగు భవుడు ప్రఖ్యాతి ధరిత్రిన్



-రాధశ్రీ

( ఏప్రిల్ 18 క్రికెట్ ఆటగాడు కానూరు లోకేష్‌రావు కె.ఎల్. రాహుల్ పుట్టినరోజు.)

సెల్: 9494481210

## 12 కోట్ల టీకాల పంపిణీ : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:: దేశంలో కరోనాకు వ్యతిరేకంగా చేపట్టిన మెగా టీకా డ్రైవ్ ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు దాదాపు 12 కోట్ల డోసులు పంపిణీ చేసినట్లు పేర్కొంది. ఉదయం 7 గంటలకు వరకు అందిన తాత్కాలిక నివేదిక ప్రకారం.. ఇప్పటి వరకు మొత్తం 11,99,37,641 మోతాదులను 17,37,539 సెషన్లలో వేసినట్లు తెలిపింది. ఇందులో 91,05,429 మంది ఆరోగ్య కార్యకర్తలకు మొదటి డోసు వేయగా.. మరో 56,70,818 మందికి రెండో డోసు వేసినట్లు చెప్పింది.

### 12 కోట్ల టీకాల పంపిణీ : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

అలాగే ఫ్రంట్‌లైన్ కార్మికుల్లో 1,11,44,069 మందికి ఫస్ట్ డోస్, 54,08,572 మందికి సెకండ్ డోస్ వేసినట్లు తెలిపింది. 60 ఏళ్లు పైబడి లబ్ధిదారుల్లో 4,49,35,011 మందికి మొదటి డోసు, 34,88,257 రెండో మోతాదును అందించినట్లు వివరించింది. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న వారికి 3,92,23,975 మొదటి మోతాదు.. మరో 9,61,510 మంది లబ్ధిదారులకు రెండో మోతాదు ఇచ్చినట్లు చెప్పింది. గడిచిన 24 గంటల్లో ఒకే రోజు 30 లక్షలకుపైగా డోసులు వేసినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది.

### 12 కోట్ల టీకాల పంపిణీ : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

ఈ నెల 16న టీకా డ్రైవ్ 91వ రోజుకు చేరగా.. ఒకే రోజు 30,04,544 వ్యాక్సిన్ మోతాదులను 37,817 సెషన్లలో వేసినట్లు చెప్పింది. 22,96,008 మంది లబ్ధిదారులకు తొలి డోస్, 7,08,536 మందికి రెండో డోస్ వేసినట్లు చెప్పింది. ఇదిలా ఉండగా దేశంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. 24 గంటల్లో 2,34,692 కొత్త కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, కేరళ, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్‌తో సహా పది రాష్ట్రాల్లో కొత్త కేసుల్లో 79.32 శాతం నమోదయ్యాయి.

### 12 కోట్ల టీకాల పంపిణీ : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

మహారాష్ట్రలో రోజువారీ కేసులు అత్యధికంగా నిన్న 63,729 కేసులు రికార్డయ్యాయి. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో 27,360 కేసులు, ఢిల్లీలో 19,486 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 16,79,740కు చేరింది. గత 24 గంటల్లో మొత్తం 1,23,354 కోలుకోగా.. ఇప్పటి వరకు 1,26,71,220 మంది డిశ్చార్జి అయ్యారు. జాతీయ రికవరీ రేటు 87.23 శాతానికి చేరింది.

కొత్తగా దేశంలో 1,341 మంది మృతి చెందగా.. ఇందులో పది రాష్ట్రాల్లోనే 85.83శాతం మరణాలు ఉన్నాయి. తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒక్క మరణాన్ని సైతం నివేదించలేదు. వీటిలో లఢఖ్, త్రిపుర, సిక్కిం, మిజోరాం, మణిపూర్, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్‌ప్రదేశ్ ఉన్నట్లు ఆరోగ్యశాఖ వివరించింది.

## మున్సిపాలిటీల్లో సోడియం హైపోక్లోరైట్ పిచికారీ చేయాలి : మంత్రి కేటీఆర్



హైదరాబాద్,ఏప్రిల్ 17: రాష్ట్రంలో కొవిడ్ ప్రబలుతున్నందున గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో సోడియం హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ చేయాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శాఖ అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సత్యనారాయణ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్‌లతో శనివారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు.

కొవిడ్ తీవ్రత దృష్ట్యా అన్ని పురపాలికల్లో వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని, హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న వాహనాలతోపాటు అవసరమైన చోట అద్దెకు తీసుకుని పిచికారీ చేయాలని చెప్పారు. పనుల నిర్వహణకు పట్టణ ప్రగతి నిధులు వినియోగించాలని సూచించారు.

కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్నందున శాఖ పరిధిలోని ఎంటమాలజిస్టులంతా అప్రమత్తంగా ఉండాలని, ఉద్యోగులంతా విధిగా విధులకు హాజరు కావాలన్నారు.

ఆరోగ్యశాఖ అధికారులతో మున్సిపల్‌శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. కొవిడ్ నియంత్రణపై ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని మంత్రి కేటీఆర్ అన్నారు.

### ఫ్రంట్‌లైన్ సిబ్బందికి 100 శాతం వాక్సినేషన్

మున్సిపల్ శాఖ సిబ్బంది కరోనాపై పోరులో ముందువరుసలో ఉన్నందున శాఖ ఉద్యోగులందరికీ వ్యాక్సినేషన్ చేయించాలని మంత్రి కేటీఆర్ ఉన్నతాధికారులకు సూచించారు.

జీహెచ్ఎంసీలో రేవటికల్లా వందశాతం ఉద్యోగులకు వ్యాక్సినేషన్ పూర్తి అవుతుంది అని, మిగతా పురపాలికల్లో కూడా ఇంకో 2-3 రోజుల్లో ఉద్యోగులు అందరికీ వ్యాక్సినేషన్ చేయిస్తామని అధికారులు మంత్రికి తెలియజేశారు.

## తెలంగాణలో రేపు, ఎల్లుండి గరిష్ఠ ఉష్ణోగ్రతలు!

హైదరాబాద్, ఏప్రిల్ 17:: రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడిం చారు. రేపు, ఎల్లుండి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. సాధారణం కన్నా2 ? 3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది.

ఇక దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం బలహీన పడింది. విదర్భ నుంచి తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. మరట్వాడా, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ద్రోణి ఏర్పడింది.

## హాస్యనటుడు వివేక్ మృతికి క్రికెటర్ల సంతాపం



చెన్నై,ఏప్రిల్ 17:: తమిళ స్టార్ కమెడియన్ వివేక్(59) గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ శనివారం ఉదయం కన్నుమూసిన విషయం తెలిసిందే. వివేక్ మృతి పట్ల పలువురు ప్రముఖులు తమ సంతాపం ప్రకటించారు. వివేక్ మరణం సినీ పరిశ్రమకు తీరని లోటు అని తమిళనాడుకు చెందిన పలువురు భారత క్రికెటర్లు పేర్కొన్నారు. భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, పేసర్ టీ నటరాజన్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్ తదితరులు వివేక్ మృతికి సంతాపం తెలుపుతూ ట్వీట్లు చేశారు. వివేక్ మరణవార్త తమను తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. 2009లో భారత నాలుగో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీతో వివేక్‌ను భారత ప్రభుత్వం సత్కరించింది.

# బండికి మంత్రి ఎర్రబెల్లి కౌంటర్




వరంగల్ ఏప్రిల్ 17: దేశంలోనే అతి పెద్ద ఝూఠ పార్టీ బిజెపి అంటూ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఫైర్ అయ్యారు?బిజెపి తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ టిఆర్ ఎస్ పార్టీపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.. వరంగల్ లో ఆయన ఎమ్మెల్యే దానం విజయ భాస్కర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వరంగల్ వరదలలో చిక్కుకుంటే కేంద్రం ఏం సాయం చేసిందని బండిని నిలదీశారు?ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అంశం విభజన చట్టంలోనే ఉందన్న విషయం కూడా బండికి తెలీయదని అంటూ వ్యాఖ్యానించారు? ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని బిజెపి ఎప్పుడు చెప్పలేదన్న బండి వ్యాఖ్యాలను ఎర్రబెల్లి ఖండిస్తూ, బిజెపి రెండు నాల్కల ధోరణికి ఇది నిదర్శనమన్నారు.. వరంగల్ ప్రజల తాగునీటి అవసరాల కోసం 957 కోట్లు ఖర్చు చేశామని, అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చినదనికంటే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు మంజూరు చేసిందని చెప్పారు. కోచ్ ఫ్యాక్టరీకి, గిరిజన యునివర్సిటీకి ఇప్పటికే టిఆర్ ఎస్ ప్రభుత్వం భూములను కేటాయిందన్న విషయం బండికి తెలుసా అంటూ ప్రశ్నించారు.. మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ' తెలంగాణలో తీవ్ర వరదలతో నష్టపోయిన హైదరాబాద్ ప్రజలకు కేంద్రం నుంచి ఏం సాయం అందింది..?. తెలంగాణాకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఎన్ని తెచ్చావ్..?. విభజన చట్టం కింద వరంగల్ కోచ్ వ్యాగన్ ఇస్తానని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీ పార్టీయే. గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఒప్పుకున్న వాటాలను ఇస్తున్నారు. మరి తెలంగాణ ప్రజలకు న్యాయమైన వాటాలను కేంద్రం ఎందుకు ఇవ్వడం లేదు..?' అని అటు కేంద్రంపై ఇటు బండిపై ఎర్రబెల్లి ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ లో మాయ మాటలు చెప్పి కొన్ని సీట్లు గెలిచిన బిజెపి ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆ పార్టీ సీటులోనే ఓడిపోయిందని ఎద్దేవా చేశారు.

ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, లీడర్ లు లేని పార్టీ కాంగ్రెస్ అని, క్యాడర్ లేని పార్టీ బిజెపి అని అన్నారు..ఇటువంటి పార్టీలు చేసే విమర్శలను తాము పట్టించుకోబోమని అన్నారు?వరంగల్ నగర అభివృద్ధికి బిజెపి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

## 25 ఏండ్లు పైబడిన వారందరికీ వ్యాక్సినేషన్ : సోనియా గాంధీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:: దేశవ్యాప్తంగా కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న క్రమంలో పాతికేండ్లు పైబడిన వారందరికీ వ్యాక్సినేషన్ కు అనుమతించాలని కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ కేంద్రాన్ని కోరారు. కొవిడ్-19 వ్యాప్తి, మహమ్మారి కట్టడికి తీసుకుంటున్న చర్యలపై చర్చించేందుకు సోనియా అధ్యక్షతన శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సీడబ్ల్యూసీ భేటీ అనంతరం ఆమె వ్యాక్సినేషన్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక వ్యవస్థపై కరోనా సెకండ్ వేవ్ ప్రభావం, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పైనా ఈ భేటీలో చర్చించారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలతో పాటు తమ పార్టీ సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వామిగా ఉన్న రాష్ట్రాల ప్రతినిధులతోనూ విస్పష్టంగా చర్చించానని, కొవిడ్-19 సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో మోదీ సర్కార్ సమర్ధంగా వ్యవహరించలేదనే అభిప్రాయం వ్యక్తమైందని సోనియా గాంధీ పేర్కొన్నారు. తమ పార్టీ సీఎంలతో సమావేశం అనంతరం తాను ప్రధానికి లేఖ రాశానని, సీఎంలు సైతం ప్రధానితో మాట్లాడారని కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ నిల్వలు అడుగంటగా ఆక్సిజన్, వెంటిలేటర్ల కొరత తీవ్రంగా ఉందని ఆమె చెప్పారు. ఇక వ్యాక్సినేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోందంటూ కాంగ్రెస్ నేతలు కేంద్రంపై విరుచుకుపడ్డారు. కాగా, అందరికీ వ్యాక్సిన్ ఇవ్వాలని, మహమ్మారితో దెబ్బతిన్న పేదల ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరుతూ ఇప్పటికే సోనియా, రాహుల్ లు ప్రధాని మోదీకి లేఖ రాశారు.

## కోవిడ్ కొరడా రెండో దెబ్బతో కుదేలైన జనజీవనం..!

ఏప్రిల్ 16, 2021 రోజున ఇండియాలో కరోనా కేసుల సంఖ్య గరిష్ఠంగా 2.17 లక్షలు నమోదైనాయి. రోజు రోజుకు కేసుల సంఖ్య రికార్డుల స్థాయిలో పెరుగుతోంది. మహమ్మారి విలయ తాండవానికి 10 రాష్ట్రాలు మహారాష్ట్ర, ఢిల్లీ, యూపి, ఛత్తీస్‌గఢ్, యంపీ, కేరళ, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్‌లలో ఎన్నడూ లేనంత అధిక కేసులు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా చేసిన కరోనా పరీక్షల్లో 14.49 శాతం మందికి పాజిటివ్‌గా తేలింది. గత ఏడాది కరోనా ప్రారంభ రోజులతో పోల్చితే రెండవ వేవ్ వైరస్ కేసుల సంఖ్య అనేక రేట్లు పెరగడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. జనంలో అతి నిర్లక్ష్య భావన, కరోనా నియమాల నియంత్రణలో ప్రభుత్వ అలసత్వం, హెర్డ్‌ఇమ్యూనిటీ చేరిందనే నమ్మకం, ఎన్నికల ప్రచార సభల నిర్వహణ, తీర్థ స్థలాల్లో లక్షల భక్తజనం గుమిగూడడం, ప్రజాందోళనలు, శుభకార్యాలు లాంటి కారణాల వల్ల కరోనా వ్యాప్తి అతి వేగంగా దేశమంతా చుట్టేస్తున్నది. టీకా తీసుకున్న వారు మరియు కరోనా సంక్రమించిన తరువాత బయటపడిన జనసంఖ్య 60 - 70 శాతానికి చేరితేనే హెర్డ్‌ఇమ్యూనిటీ దశ వస్తుంది. అలా జరిగినపుడు మాత్రమే కరోనా భయం కొంత పలుచబడుతుంది. నేడు దేశంలో రోజుకు దాదాపు 40 లక్షల టీకాలు ఇవ్వడం జరుగుతోంది. ఇదే వేగంతో కొనసాగితే వ్యాక్సినేషన్ యజ్ఞం 2021లో పూర్తి కావడం అసాధ్యమే అంటున్నారు.

బ్రెజిల్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ మరియు పోలాండ్ లాంటి దేశాల్లో కేసులు అతిగా బయట పడుతున్నాయి. కొన్ని దేశాలు లాక్‌డౌన్ విధించడం మరియు ప్రయాణ పరిమితులను ప్రవేశ పెట్టడం జరుగుతోంది. 2020లో 15,000 కేసుల నుంచి 97,000లకు పెరగడానికి 90 రోజులు పట్టగా, నేడు రెండవ వేవ్ స్వైరవిహారంతో 10 రోజుల్లోనే ఒక రోజు ఒక లక్ష కేసులు 2 లక్షలకు పెరగడం భయాందోళనలకు కారణం అవుతున్నది. నవంబర్ 2020 తరువాత కేసుల సంఖ్య చాలా తగ్గడంతో ప్రజల్లో అతివిశ్వాసం పెరిగి కరోనా భయం నీడలు తొలగిపోయాయి. విదేశీ ప్రయాణాల అనుమతితో యూకె, దక్షిణ ఆఫ్రికా మరియు బ్రెజిల్ నుంచి కొత్త కరోనా వేరియంట్స్ (వైవిధ్య వైరస్‌లు) భారత్‌లో అడుగిడినాయి. గత వారం నిర్వహించిన కరోనా పరీక్షల్లో రాపిడ్ టెస్టుల్లో 9 శాతం పాజిటివ్ ఫలితాలు ఇవ్వగా, ఆర్‌టి-పిసిఆర్ పరీక్షల్లో 34 శాతం పాజిటివ్ రావడం జరిగింది. రాపిడ్ టెస్టుల్లో నెగెటివ్ వచ్చిన జనం స్వేచ్ఛగా జనంలో తిరగడంతో వైరస్ వ్యాప్తి అనేక రేట్లు పెరుగుతున్నాయి. దక్షిణ ఆఫ్రికా మరియు యూకె వేరియంట్లు పంజాబ్, తెలంగాణ, మహారాష్ట్ర మరియు ఢిల్లీల్లో అతి వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని తెలుస్తున్నది. బెంగుళూరులో పిల్లల ద్వారా పెద్దలకు అతి వేగంగా కరోనా వ్యాప్తి జరుగుట గమనించారు. కరోనా విజృంభనతో ఆసుపత్రి వసతులు, ఐసియు బెడ్స్, ఆక్సీజన్ సరఫరా మరియు వెంటిలేటర్ల లభ్యత కష్టం కావడంతో పాటు వైద్య సిబ్బంది అతి ఒత్తిడికి గురి అవుతున్నాయి.

కరోనా కేసులు లక్షల్లో పెరిగిన అకాలంలో గోరు చుట్టుపై రోకలి పోటులా దుర్భర స్థితుల్లో ఉన్న పేదవర్గాలు అధఃపాతాళానికి నెట్టబడడం అత్యంత విచారకరం. ముంబాయ్ మరియు ఢిల్లీ లాంటి మహానగరాల నుంచి వలసదారులు తిరిగి ఇంటి ముఖం పట్టారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు మరోసారి నిండుకుండలను తలపిస్తున్నాయి. గత లాక్‌డౌన్ సమయంలో నరేంద్ర మోదీ ఆదేశాలను దేశ 1.3 బిలియన్ ప్రజలు తూచా తప్పక పాటించిన విషయం మనకు గుర్తుంది. మిలియన్ల వలసదారులు కాలి నడకన గ్రామాలకు తరలడం అత్యంత బాధలను మిగిల్చాయి. ఆయా సందర్భాలలో స్వచ్ఛంధ సంస్థలు/కార్యకర్తలు వలసదారులకు కనీస అవసరాలు తీర్చడానికి ముందుకు రావడంతో మానవీయత వెల్లివిరిసింది. నేడు కరోనా రెండవ దెబ్బకు తల్లడిల్లుతున్న నిరుపేదలు హితవరుల వైపు ఆర్తితో చూడడం జరుగుతోంది. నేడు చిరువ్యాపారులు, వీధి అమ్మకాలు, మురికివాడల్లో చిట్టి దుకాణాలు, తోపుడు బండ్లు, పండ్ల అమ్మకాలు, గృహ శ్రామికులు, వ్యర్థాలను సేకరించే దీనులు తీవ్ర నష్టాలను అనుభవిస్తున్నారు. మిలియన్ల భక్తులు పాల్గొనే మహా కుంభమేళకు అనుమతిని ఇవ్వడం, మినీ జనరల్ ఎలక్షన్లు జరుగుతున్న కేరళ, అస్సాం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వేదికల మీద మోదీతో పాటుగా అన్ని పార్టీల జాతీయ నాయకులు సభలు/సమావేశాలు నిర్వహించడం, కరోనా నిబంధనలను పక్కకు పెట్టడం సర్వసాధారణం అయ్యింది. మరో సారి లాక్‌డౌన్ విధించాల్సిన దుస్థితి ఏర్పడితే ఆకలి చావులు అనివార్యం కావచ్చు. మొ?దటి వేవ్ అనుభవాలను మననం చేసుకుంటూ, రెండవ వేవ్ పరిస్థితి తీవ్రతను గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు ఆర్థిక సామాజిక సహాయక చర్యలను వెంటనే తీసుకోవాలి. రాజకీయ నాయకులు మరింత బాధ్యతగా వ్యవహరించాలి.

కోవిడ్-19 కల్లోలంతో ఆర్థిక చిక్కులు మరింతగా పెరగడంతో పేదలు మరియు వలసదారులు దుర్భర పరిస్థితిలోకి నెట్టబడ్డారు. వారాంత మరియు రాత్రి కర్ఫ్యూలు విధించడం కొన్ని పట్టణాల్లో అనివార్యం అయ్యింది. మార్చి-2020 తరువాత పాటించిన సామాజిక నియమనిబంధనలు (మాస్కులు, సానిటైజర్లు, సామాజిక దూరాలు) నేడు చాలా పలుచబడ్డాయి. వ్యాక్సినేషన్ కేంద్రాలను పెంచడం, ఆ కేంద్రాలలో పరిశుభ్రతను పాటించడం, పాజిటివ్‌లను ఐసొలేట్ చేయడం, టీకాల వేగాన్ని పెంచడం, కంటేయిన్‌మెంట్ జోన్లు నిర్వహించడం, జన సమూహాలను కట్టడి చేయడం, ఎన్నికల సభలు రద్దు చేయడం, మత సమ్మేళనాలను కట్టడి చేయడంలాంటివ సత్వరమే చేపట్టాలి. ప్రభుత్వం మరియు పౌరసమాజం కలిసికట్టుగా కరోనాపై యుద్ధం ప్రకటిస్తేనే రెండవ వేవ్ వ్యాప్తిని వేగంగా అరికట్టవచ్చు. కోవిడ్ నిబంధనలైన టెస్టింగ్, ట్రాకింగ్ మరియు ట్రీటింగ్‌లను ఉద్యమంలా చేపట్టాలి. ప్రపంచంలోనే అత్యధిక టీకాలను తయారు చేసే భారతంలో టీకాల కొరత ఏర్పడడం అత్యంత హాస్యాస్పదం, ఖండనీయం. ప్రభుత్వం టీకాల తయారీని వేగవంతం చేస్తూ, టీకాల కొరతను అధిగమిస్తూ, కరోనా క్రమశిక్షణలను అమలు పరుచుతూ, వైరస్ వైరిపై యుద్ధంలో పైచేయిని సాదిద్దాం. కరోనా విష కోరల్ని కసితో పీకేద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## బెంగాల్ పీఠం మాదే : అమిత్ షా

కోల్ కతా, ఏప్రిల్ 17:: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ పార్టీ 200కుపైగా స్థానాల్లో గెలుపొంది అధికార పగ్గాలు చేపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. బెంగాల్ లో బీజేపీ మాత్రమే చొరబాట్లను నిలువరిస్తుందని అన్నారు. అసుగ్రాంలో శనివారం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ బెంగాల్ లో బీజేపీ పవనాలు వీస్తున్నాయని చెప్పుకొచ్చారు.

మే 2 తర్వాత దీదీ ఇంటి బాట పడతారని, బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అంతకుముందు ఉత్తర 24పరగణాల జిల్లా అమ్డంగలో అమిత్ షా రోడ్ షో నిర్వహించారు. దీదీ పాలనకు బెంగాల్ ప్రజలు చరమగీతం పాడనున్నారని పేర్కొన్నారు. బెంగాల్ లో అయిదో దశ పోలింగ్ జరుగుతున్న క్రమంలో ఏప్రిల్ 29 నాటికి ఎనిమిది దశల పోలింగ్ ముగియనుంది. మే 2న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

## కొవిడ్-19 కేసుల తీవ్రత : రాష్ట్రాల ఆరోగ్య మంత్రులతో కీలక భేటీ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: : దదేశవ్యాప్తంగా కొవిడ్-19 కేసులు పెరుగుతుండటంతో మహమ్మారి కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ శనివారం పలు రాష్ట్రాల ఆరోగ్య మంత్రులతో కీలక సమావేశం నిర్వహించారు. కేసుల పెరుగుదలతో రాష్ట్రాలు ముందస్తు ప్రణాళికలతో మహమ్మారి కట్టడికి దవాఖానలు, పడకలు, ఆక్సిజన్, వెంటిలేటర్లు వంటి మౌలిక వసతులను భారీగా మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ భేటీలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేతో కేంద్ర మంత్రి మాట్లాడారు. వైరస్ తీవ్రతతో సతమతమవుతున్న రాష్ట్రానికి నిరంతర ఆక్సిజన్ సరఫరాలతో పాటు అవసరమైన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఉప్పెన కెమిస్ట్రీ రిపీట్ కాబోతుంది!!



బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్ హీరోగా కృతి శెట్టి హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం ఉప్పెన. గతేడాది రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం కరోనా కారణంగా వాయిదా పడింది. అయితే ఈ ఏడాది విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడంతో పాటు కోట్ల రూపాయలను వసూలు చేసింది. ఇక ఈ సినిమాలో వైష్ణవ్ తేజ్ కృతి కెమిస్ట్రీ ఆడియన్స్ కు తెగ నచ్చేసింది. ఈ నేపథ్యంలోనే మరోసారి ఈ జోడిని సెట్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మైత్రి మూవీ మేకర్స్ ఇద్దరిపై మరో సినిమా చేయడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు సుకుమార్ శిష్యుడు అయిన మరో యంగ్ డైరెక్టర్ ఈ సినిమాకి దర్శకత్వం వహించబోతున్నాడని సమాచారం. ఇక వైష్ణవ్ ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. కృతి శెట్టి శ్యామ్ సింగ రాయ్, అలాగే మోహన్ కృష్ణ సుధీర్ బాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో నటిస్తోంది. అలాగే రామ్ పోతినేని లింగు స్వామి సినిమాలో కూడా కృతి శెట్టి నటించనుంది.

## 'ఐకాన్' పై దిల్ రాజు ఫుల్ ఫోకస్

ప్రముఖ నిర్మాత దిల్ రాజు మొత్తం ఫోకస్ ఐకాన్ సినిమాపైనే ఉందంటూ క్లారిటీ ఇచ్చారు. వకీల్ సాబ్ సక్సెస్ మీట్ లో మాట్లాడిన ఆయన వ్యక్తిగతంగా ఐకాన్ స్క్రిప్ట్ కు కనెక్ట్ అయ్యానని వేణు శ్రీరామ్ చెప్పిన లైన్ చాలా బాగా నచ్చిందని? ఇప్పటికే పూర్తి స్క్రిప్ట్ కూడా రెడీ చేశామని చెప్పారు. ఇంక సినిమా మొదలు పెట్టడమే తరువాయి ఉందని క్లారిటీ ఇచ్చారు.

కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్టు ను ఆలస్యం చేయవలసి వచ్చిందని. ఇక ఇప్పుడు ఆగేది లేదని చెప్పుకొచ్చారు. వకీల్ సాబ్ రిలీజ్ కు ముందు నో ఐడియా అని చెప్పిన దిల్ రాజు.. రిలీజ్ తర్వాత మాత్రం ఐకాన్ రెడీ అంటూ చెప్పడం విశేషం. ఇక ఈ సినిమాకి కూడా వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించబోతున్నాడు. మరోవైపు బన్ని ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో పుష్ప సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా తర్వాత బన్నీ ఐకాన్ చేయబోతున్నాడని ప్రచారం జరుగుతుంది. మరి బన్నీ ఐకాన్ సినిమా చేస్తాడా లేక వేరొక దర్శకుడికి అవకాశం ఇస్తాడు అనేది చూడాలి.




## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ మా హక్కు : బోయినపల్లి వినోద్ కుమార్

వరంగల్, ఏప్రిల్ 17: : కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ మా హక్కు.. మీరు ఇచ్చేదేం కాదు అని బీజేపీ నేతలను ఉద్దేశించి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడారు. కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేనమి చెప్పాలి గానీ.. అస్సలే రాదనడానికి మీరు ఎవరు? అని ప్రశ్నించారు. అన్ని కోచ్ ఫ్యాక్టరీలు ఉత్తర భారతదేశంలో ఎందుకు ఉండాలి? ఎందుకు దక్షిణ భారతదేశంలో, తెలంగాణలో ఉండకూడదు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేస్తామని బోయినపల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

## కరోనా మృతదేహం ట్రాక్టర్ ట్రాలీలో తరలింపు

రాయపూర్, ఏప్రిల్ 17:: కరోనాతో మరణించిన ఒకరి మృతదేహాన్ని ఓపెన్‌గా ట్రాక్టర్ ట్రాలీలో తరలించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రాజ్‌నందన్ గ్రామంలో కరోనాతో చనిపోయిన ఒక వ్యక్తి మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి ట్రాక్టర్ ట్రాలీలో తరలించడం వివాదమైంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. అయితే అంత్యక్రియల కోసం ఏర్పాట్లు చేసే క్రమంలో తొందర వల్ల ఇలా జరిగి ఉంటుందని పంచాయతీ అధికారి మిత్లేష్ చౌదరి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో కరోనా విలయతాండవం చేస్తున్నది. కరోనా కేసులతోపాటు మరణించిన వారి సంఖ్య పెరుగుతున్నది. దీంతో కరోనా రోగుల మృతదేహాలు ఆసుపత్రుల మార్చురీలలో పేరుకుపోతున్నాయి. శ్మశానవాటికలకు తరలింపు కోసం అంబులెన్స్‌ల కొరత నెలకొన్నది. అలాగే అంత్యక్రియల కోసం శ్మశానవాటికల వద్ద కరోనా మృతులతో అంబులెన్స్‌లు క్యూకడుతున్నాయి.

## స్మార్ట్‌గా దోపిడీ.. రూ.5 లక్షలు చోరీ



హైదరాబాద్, ఏప్రిల్ 17: పార్క్ చేసిన కారు అద్దం పగులగొట్టి ఇద్దరు వ్యక్తులు రూ.5 లక్షలు చోరీ చేశారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురిలో నివాసముండే ఎం.నర్సింహ ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఓ ప్లాటు రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇందులో భాగంగా వచ్చిన రూ.5 లక్షలను తన కారు (టీఎస్07హెచ్‌డీ3555)లో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి జడ్జస్ కాలనీకి వెళ్లాడు. కాలనీలోని రోడ్ నెంబర్ 5లో కారును పార్క్ చేసి కొంతదూరంలో ఉన్న ఓ ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా కారు వెనుక వైపు ఉన్న అద్దం పగిలి ఉంది. కారు డోర్ ఓపెన్ చేసి చూడగా నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచే వెంబడించిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు పల్సర్‌పై.. మరొకరు నడుచుకుంటూ వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. కారులో డబ్బులు దాచిన విషయాన్ని గమనించే పక్కా ప్లాన్‌తో ఈ దోపిడీ చేశారని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సిటీ' క్రెడిట్ కార్డుపై 'ఎస్బీఐ' కన్ను

హైదరాబాద్, ఏప్రిల్ 17: సిటీ బ్యాంక్ ఆధ్వర్యంలోనే క్రెడిట్ కార్డు బిజినెస్‌పై కేంద్ర ప్రభుత్వ రంగ వాణిజ్య సంస్థ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), ఇతర ప్రైవేట్ బ్యాంకులు కన్నేశాయి. భారత్ మార్కెట్ నుంచి వైదొలగాలని సిటీ గ్రూప్ గురువారం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

సిటీ బ్యాంక్ నిష్క్రమణతో దేశంలోని క్రెడిట్ కార్డుల మార్కెట్‌లో విస్తరించడానికి ఎస్బీఐతో సహా పలు బ్యాంకులకు చక్కని అవకాశం లభించింది. సిటీ క్రెడిట్ కార్డుల బిజినెస్‌ను టేకోవర్ చేస్తుందన్న అంచనాల మధ్య శుక్రవారం ఎస్బీఐ అనుబంధ సంస్థ ఎస్బీఐ కార్డ్ షేర్ 7.5 శాతం పెరుగడం గమనార్హం.

ఒకవైపు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) ఆంక్షలను అమలు చేస్తూనే క్రెడిట్ కార్డుల బిజినెస్‌లో అతిపెద్ద సంస్థగా హెచ్డీఎఫ్సీ బ్యాంకుకు పేరుందని ఆ సంస్థ వర్గాల సమాచారం. ప్రత్యర్థుల బిజినెస్ క్రమంగా నెమ్మదించడంతో ఎస్బీఐ దూసుకెళ్లింది. ఇదే ఇప్పుడు సిటీ క్రెడిట్ కార్డు బిజినెస్‌ను టేకోవర్ చేయడానికి సానుకూలంగా మారిందన్న అభిప్రాయం ఉంది.

సిటీ బ్యాంకు వివిధ విభాగాలను విడివిడిగా విక్రయించనున్నదని మాక్వైర్ క్యాపిటల్ రీసెర్చ్ అనలిస్ట్ సురేశ్ గణపతి తెలిపారు. ఈ నేపథ్యంలో పలు బ్యాంకులు.. సిటీ క్రెడిట్ కార్డుల బిజినెస్ పట్ల ఆసక్తి చూపుతున్నాయి.

రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్ (ఆర్బీఎల్), ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంక్ వంటి చిన్న బ్యాంకులు కూడా సిటీ బ్యాంక్ క్రెడిట్ కార్డుల బిజినెస్‌ను టేకోవర్ చేసేందుకు అవసరమైన బిడ్లను దాఖలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.ఒకప్పుడు క్రెడిట్ కార్డుల బిజినెస్‌లో లీడర్‌గా ఎదిగిన సిటీ బ్యాంక్.. ఏండ్లు గడుస్తున్నా కొద్దీ తన వాటాను కోల్పోయింది. రిటైల్ బిజినెస్ నుంచి నిష్క్రమణ ప్రకటన చేయడానికి ముందు కూడా సిటీ బ్యాంక్ తన శాఖల్లో బిజినెస్‌ను తగ్గించేసింది. క్రెడిట్ కార్డుల స్వాధీనం, ఇతర సంస్థలతో భాగస్వామ్యంపై ఫోకస్ చేసింది.

దేశీయ క్రెడిట్ కార్డుల బిజినెస్‌లో సిటీ బ్యాంక్ ఆరో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో ఉన్న హెచ్డీఎఫ్సీకి 15.3 మిలియన్ల ఖాతాదారులు, రెండో స్థానంలోని ఎస్బీఐకి 11.6 మిలియన్ల ఖాతాదారులు ఉన్నారు.

ఐసీఐసీఐకి 10.2 మిలియన్లు, యాక్సిస్ బ్యాంక్‌కు 69 లక్షల మంది, ఆర్బీఎల్‌కు 29 లక్షల మంది ఖాతాదారులు ఉన్నారు. తర్వాత ఆరో స్థానంలో ఉన్న సిటీ బ్యాంకులో 27 లక్షల మంది, ఏడో స్థానంలోని కొటక్‌లో 24 లక్షల మంది, అమెక్స్‌లో 16 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

అయితే, భారీ సంఖ్యలో హైనెట్‌వర్త్ కస్టమర్లు కలిగి ఉండటంతో సిటీ బ్యాంక్ క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియో హై క్వాలిటీ పోర్ట్‌ఫోలియోగా నిలిచింది. క్రెడిట్ కార్డుల ఇండస్ట్రీలోనే సగటున సిటీ క్రెడిట్ కార్డు గణనీయంగా వాడుతున్నారు.

మొత్తం క్రెడిట్ కార్డు మార్కెట్‌లో ఎస్బీఐ వాటా 20 శాతం ఉంది. దీని విలువ రూ.90వేల కోట్ల పై చిలుకే. సిటీ క్రెడిట్ కార్డుల విలువ కనీసం రూ.22 వేల కోట్లు ఉంటుంది.

ఇటీవలే క్రెడిట్ కార్డుల కంపెనీల గుర్తింపు నిబంధనలను ఆర్బీఐ సవరించింది. క్రెడిట్ కార్డుల బిల్లు వసూళ్లకు బ్రాంచ్ నెట్‌వర్క్ అవసరం అని బ్యాంకర్లు చెబుతున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com